మీనమేషాలు

ముల్కలపల్లి వద్ద బ్రిడ్జి నిర్మాణానికి మోక్షమెప్పుడో.?



ముల్కలపల్లి వద్ద ఆకేరువాగు వరదకు కొట్టుకుపోయిన బ్రిడ్జి (ఫైల్)

- ఇంకా ఖరారు కాని ఆకేరు డ్యామ్ డిజైన్
- బ్రిడ్జి కొట్టుకుపోయి 11 నెలలైనా అతీగతీ లేదు
- లో-లెవల్ వంతెన పైనుంచే రాకపోకలు

డోర్నకల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని డోర్నకల్ మండలం ముల్కలపల్లి వద్ద ఆకేరుపై కట్టే బ్రిడ్జి నిర్మాణంలో తాత్సారం జరుగుతోంది. కొట్టుకుపోయిన బ్రిడ్జి స్థానంలో మరో వంతెన నిర్మించడానికి నేషనల్ హైవే అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. గత ఏడాది సెప్టెంబర్ 1వ తేదీన వచ్చిన భారీ వరదలకు పూర్తిగా బ్రిడ్జి ధ్వంసం కాగా, పక్కనే మరోదాన్ని నిర్మించేందుకు సంకల్పించారు. దీంతో పనులు పరుగు పెట్టడం లేదు. బ్రిడ్జి నిర్మాణ నమూన ఖరారు కాలేదు.


మహబూబాబాద్ నుంచి కోదాడ వయా ఖమ్మం మీదుగా జాతీయ రహదారి 365/ఏ డోర్నకల్ మండలం ముల్కలపల్లి వద్ద ఆకేరుపై నిర్మించిన బ్రిడ్జి గతేడాది సెప్టెంబర్ 1వ తేదీన వచ్చిన భారీ వరదలకు పూర్తిగా ధ్వంసమైంది. వరద తాకిడికి బ్రిడ్జిపై ఉన్న బెడ్‌బ్లాక్‌లు స్లాబ్‌తో సహా కొట్టుకుపోయాయి. బ్రిడ్జి నుంచి సుమారు 70 మీటర్ల దూరంలో పడ్డాయి. దీంతో ఆ మార్గం మీదుగా సుమారు 20 రోజుల పాటు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. 2008 సంవత్సరంలో ఈ బ్రిడ్జి నిర్మాణం పనిని చేపట్టిన గుత్తేదారు 2011లో పూర్తి చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పునర్విభజన అనంతరం ఈ రోడ్డును జాతీయ రహదారి నిర్మాణ ప్రాధికార సంస్థ దీనికి 365/ఏ నెంబర్‌ను కేటాయించింది. 86 కిలోమీటర్ల పొడవైన ఈ రోడ్డు మహబూబాబాద్ వయా ఖమ్మం మీదుగా కోదాడ వరకు నిర్మాణం, నిర్వహణ అంతా కూడా నేషనల్ హైవే అథారటీ ఆఫ్ ఇండియా పర్యవేక్షిస్తోంది. ఈ రోడ్డు మహబూబాబాద్, కురవి, సీరోలు, డోర్నకల్, ఖమ్మం జిల్లాలోని ఖమ్మం రూరల్, ముదిగొండ, నేలకొండపల్లి, సూర్యాపేట జిల్లాలోని కోదాడ వరకు ఉంది.

ముల్కలపల్లి వద్ద కొట్టుకుపోయిన బ్రిడ్జి...

డోర్నకల్ మండలం ముల్కలపల్లి వద్ద ఆకేరుకు భారీ వరద పోటెత్తడంతో వరద ఉధృతికి బ్రిడ్జి కొట్టుకుపోయింది. దీంతో మహబూబాబాద్ నుంచి ఖమ్మం జిల్లాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. అప్పట్లో బ్రిడ్జి కొట్టుకుపోయిన విషయం ఈ ప్రాంతంలో పెను సంచలనమైంది. వరద నష్టం అంచనా వేయడానికి ముల్కలపల్లికి వచ్చిన కేంద్ర బృందాలు సైతం ఆశ్చర్యం వ్యక్త చేశారు.

లో-లెవల్ బ్రిడ్జి మరమ్మతులు చేసి రాకపోకలు..

గతేడాది వచ్చిన భారీ వరదలకు ముల్కలపల్లి వద్ద హైలెవల్ బ్రిడ్జి కొట్టుకుపోయింది. దీంతో దాని పక్కనే ఉన్న 1987లో నిర్మించిన లో లెవల్ బ్రిడ్జికి అధికారులు మరమ్మతులు చేసి మహబూబాబాద్ నుంచి ఖమ్మంకు రాకపోకలు పునరుద్ధరించారు. ప్రస్తుతంలో లెవల్ బ్రిడ్జి పై నుంచే భారీ వాహనాలు మొదలుకుని ఇతర వాహనాలు వెళ్తున్నాయి.



ప్రస్తుతం వాహనాల రాకపోకలు కొనసాగిస్తున్న లో లెవల్ వంతెన

వర్షాకాలంలో ఎదురుకానున్న ఇబ్బందులు...

కొట్టుకుపోయిన బ్రిడ్జి స్థానంలో మరో బ్రిడ్జిని నిర్మించడానికి నేషనల్ హైవే అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఇంత వరకు బ్రిడ్జి నిర్మాణానికి కార్యాచరణకు పూనుకోలేదు. భారీ వరదను అంచనా వేసి నూతన డిజైన్‌లతో బ్రిడ్జి నిర్మించాల్సి ఉండగా.. ఆ దిశగా ఇంకా ప్రయత్నాలు కూడా ప్రారంభించలేదు. వంతెన నిర్మాణానికి డీపీఆర్‌ను కూడ ఇంకా సిద్ధం చేయలేదని తెలుస్తోంది. మరోవైపు మహబూబాబాద్ నుంచి కోదాడ వరకు ప్రస్తుతం ఉన్న రహదారిని వెడల్పు చేసే కార్యక్రమానికి అధికారులు సమాయత్తమవుతున్న బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ప్రస్తుతం ఖమ్మం వైపు గ్రీన్‌ఫీల్డ్ హైవేగా మార్చే పనులు ప్రారంభమై పురోగతిలో ఉన్నాయి. ముల్కలపల్లి వద్ద బ్రిడ్జి నిర్మాణాన్ని వెంటనే చేపట్టి పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని వాహనదారులు కోరుతున్నారు.



జిల్లా జనరల్ ఆస్పత్రిలో అందుతున్న వైద్య సదుపాయాల గురించి రోగులను అడిగి తెలుసుకుంటున్న వాసం వెంకటేశ్వరరెడ్డి

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

- సీజనల్ వ్యాధుల వ్యాప్తి పట్ల అప్రమత్తంగా ఉండాలి
- క్షేత్రస్థాయిలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలి
- రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి
- జిల్లా ప్రధాన ఆస్పత్రిలో ఫీవర్ వార్డు, ఐసీటీసీ సెంటర్ పరిశీలన

8

రెవెన్యూ అధికారులతో రైతుల వాగ్వివాదం

- నారాయణపురంలో అధికారుల స్పెషల్ డ్రైవ్



నారాయణపురంలో అధికారులతో వాదనకు దిగిన రైతులు

కేసముద్రం, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నారాయణపురంలో రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలిచ్చేందుకు రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన స్పెషల్ డ్రైవ్‌లో వాగ్వాదం చోటు చేసుకుంది. కలెక్టర్ ఆదేశాలతో గ్రామంలో మంగళవారం కేసముద్రం, గూడూరు, బయ్యారం తహసీల్దార్లు వివేక్, నాగభవాని, నాగరాజు ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్‌ను ఏర్పాటు చేశారు. ఈ స్పెషల్ డ్రైవ్ బుధవారం కూడా నిర్వహిస్తామని తహసీల్దార్ తెలిపారు. పట్టాదారు పాస్‌పుస్తకాల కోసం, ఎంజాయ్‌మెంట్ సర్వేలో పాల్గొన్న రైతులు తమ పాత పట్టాలను, సాదాబైనామా కాగితాలను అందజేయాలని రైతులను అధికారులు కోరారు. దీంతో ఎంజాయ్‌మెంట్ సర్వే జాబితాలను విడుదల చేయకుండా మళ్లీ దరఖాస్తుల స్వీకరణ ఏమిటని, టీఎం 33లో మూడేళ్లుగా 143దరఖాస్తులు పెండింగ్‌లో పెట్టి ఉంచారని అధికారులను ప్రశ్నించారు. రెవెన్యూ అధికారులు తమకు పట్టాలివ్వకుండా కాలయాపన చేస్తోందని ఆరోపించారు. అనంతరం పలువురు రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ సర్వయ్య పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

తహసీల్దార్ ఆఫీస్ ఉద్యోగిపై పెట్రోల్ పోసి, దాడికి యత్నం

నలుగురిపై కేసు నమోదు

గార్ల, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న రికార్డు అసిస్టెంట్ శ్రీదేవిపై అదే కార్యాలయంలో పనిచేస్తున్న ఏఎస్‌వో తన కలిసి కుటుంబసభ్యులతో కలిసి రికార్డు రూంలో ఒంటరిగా ఉన్న సమయంలో మూకుమ్మడిగా దాడి చేసి, పెట్రోల్ పోసిన ఘటన మంగళవారం సాయంత్రం ఆలస్యంగా వెలుగు చూసింది. వారం రోజులుగా కంప్యూటర్ ఆపరేటర్ సీనియర్ అసిస్టెంట్ సెల్ నుంచి అసభ్యకరమైన మేస్సేజ్‌లు వస్తున్నాయని, దీనికి రికార్డు అసిస్టెంట్ శ్రీదేవి పాత్ర ఉందని కోపం పెంచుకున్నాడు. దీంతో ఏఎస్‌వో సౌందర్య కుటుంబసభ్యులు సాయంత్రం సమయంలో కార్యాలయంకు వెళ్లి సదురు ఉద్యోగిపై దాడి చేసి, పెట్రోల్ పోయడంతో తోటి ఉద్యోగులు నివారించారు. రికార్డు అసిస్టెంట్ శ్రీదేవి ఫిర్యాదు మేరకు నలుగురి పైకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై రవీందర్ రావు తెలిపారు.

ఫటాఫట్

రైతులు కొత్త రుణాలు పొందాలి

మరిపెడ పీఏసీఎస్ చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ చాపల యాదగిరిరెడ్డి



రాష్ట్ర ప్రభుత్వం రైతన్నల రుణాలను మాఫీ చేసింది. రైతులు మాఫీ యైన తమ బ్యాంకు రుణాలను రెన్యువల్ చేసుకొని కొత్తగా రుణాలు పొందాలని మరిపెడ పీఏసీఎస్ చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ చాపల యాదగిరిరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన ఆంధ్రజ్యోతితో ఫటాపట్ మాట్లాడుతూ రైతులకు పలు సూచనలు, తగు జాగ్రత్తలను వివరించారు.

ఆంధ్రజ్యోతి : ఖరీఫ్ పంటలకు యూరియాను సరిపడా సరఫరా చేస్తున్నారా?

చైర్మన్ : పీఏసీఎస్ ద్వారా రైతులకు యూరియా కావల్సినంతా సరఫరా చేస్తున్నాం. రోజుకు 500 మందికి యూరియా అందేవిధంగా తగు ప్రణాళికతో ముందుకెళ్తున్నాం.

ఆంధ్రజ్యోతి : యూరియా కొరత ఉందా?

చైర్మన్ : అవన్నీ పుకార్లు డిప్యూటీ స్పీకర్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ సహకారంతో మరిపెడ పీఏసీఎస్, చిన్నగూడూరు మండలం జయ్యారంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి యూరియాను రైతులకు బస్తా ఒక్కంటికి రూ.267కే విక్రయిస్తున్నాం. అదనంగా రైతులు హమాలీ చార్జీలు చెల్లించాలి.

ఆంధ్రజ్యోతి : మరిపెడ డీసీసీబీ బ్యాంకు టర్నోవర్ ఎంత?

చైర్మన్ : మరిపెడ డీసీసీబీ ద్వారా గతంలో రూ.17కోట్లు మాత్రమే టర్నోవర్ ఉండేది. ఇప్పుడు రూ.150కోట్ల టర్నోవర్‌కు బాంక్ లావాదేవీలు చేరుకొని జిల్లాలోనే ఫస్ట్ ర్యాంక్‌తో మరిపెడ డీసీసీబీ బ్యాంకు నడుస్తున్నది.

ఆంధ్రజ్యోతి : మరిపెడ పీఏసీఎస్‌లో సభ్యత్వం కలిగిన రైతుల సంఖ్య ఎంత?

చైర్మన్ : మొత్తం ఏడు వేలకు పైగా రైతులు సభ్యత్వం కలిగి ఉన్నారు. కొనుగోలు కేంద్రాలతో పాటు రైతులకు అన్ని వ్యవసాయ సౌకర్యాలు కలిపిస్తున్నాం.

- మరిపెడ, ఆంధ్రజ్యోతి

పాఠశాలల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

మహబూబాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, ఇందిరానగర్‌లోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో మంగళవారం కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. కేజీబీవీలో విద్యార్థుల యొక్క అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి ప్రతిభా పాటవాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు సిలబస్‌ను షెడ్యూల్ వారీగా పూర్తిచేసి విద్యార్థులకు అర్థమయ్యేరీతిలో పాఠాలు బోధించాలని కలెక్టర్ సూచించారు. నిర్ణీత సమయంలో అవసరమైన పరీక్షలు నిర్వహించి వారిలోని సృజనాత్మకతను వెలికి తీయాలన్నారు. నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదుల పనులను పరిశీలించి వెంటనే పూర్తి చేయాలన్నారు. వంటశాల, స్టోర్ గదిని పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారాన్ని అందించాలని చెప్పారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఇందిరానగర్‌లోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి విద్యార్థుల భోజనాన్ని స్వయంగా రుచి చూసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.



మహబూబాబాద్ కేజీబీవీలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్



42 శాతం రిజర్వేషన్ అమలు చేశాకే ఎన్నికలకు వెళ్లాలి

- మాజీ మంత్రి సత్యవతిరాథోడ్

8

ఎలుకల మందు తాగి విద్యార్థి ఆత్మహత్య

7

3న బొగత, రామప్ప, లక్నవరం టూర్ ప్యాకేజీ బస్సు

- మానుకోట ఆర్టీసీ డీఎం శివప్రసాద్



మహబూబాబాద్ టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ ప్రవేశపెట్టిన యాత్రలో భాగంగా మహబూబాబాద్ ఆర్టీసీ డిపో నుంచి ఆగస్టు 3న మల్లూరు బొగత జలపాతం, రామప్ప, లక్నవరం టూర్ ప్యాకేజీ బస్సు బయలు దేరుతుందని స్థానిక ఆర్టీసీ డీఎం ఎం.శివప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 3న తెల్లవారుజామున 5 గంటలకు మానుకోట నుంచి 40 సీట్ల డీలక్స్‌బస్సు బయలు దేరుతుందని బొగత జలపాతం, రామప్ప, లక్నవరం విహార యాత్ర ప్రదేశాలను చూసుకుని తిరిగి రాత్రి 10 గంటలకు మానుకోటకు చేరుకుంటుందని చెప్పారు. టిక్కెట్ ధర పెద్దలకు ఒక్కొక్కరికి రూ. 700, పిల్లలకు రూ. 400 నిర్ణయించడం జరిగిందని బుకింగ్ కోసం ఇన్‌చార్జి ఎమ్మీ. నబి సెల్: 99482 14022కు ఫోన్‌పే చేసి సీటు బెక్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ సదవకాశాన్ని మహబూబాబాద్ పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకుని పుణ్యక్షేత్రాలు, విహార ప్రదేశాలను సందర్శించాలని కోరారు.

నేడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి రాక



రాంచందర్‌రావు

మహబూబాబాద్ రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : మానుకోట జిల్లాకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు బుధవారం రానున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్.రాంచందర్‌రావు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన తర్వాత తొలిసారి మహబూబాబాద్‌కు వస్తున్నట్లు చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు నుంచి మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం గంధంపల్లికి మధ్యాహ్నం 3 గంటలకు చేరుకుంటారని చెప్పారు. అక్కడ్నుంచి మహబూబాబాద్‌కు చేరుకుని ఫ్లైఓవర్ మీదుగా కురవికి వెళ్లి శ్రీవీరభద్రస్వామిని దర్శించుకోనున్నట్లు చెప్పారు. ఆ తర్వాత మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కురవి గేట్ నుంచి బైక్ ర్యాలీగా అండర్‌బ్రిడ్జి, నెహ్రూసెంటర్, తహసీల్ సెంటర్ మీదుగా శ్రీనివాసథియేటర్ నుంచి మదర్‌థెరిస్సా సెంటర్, ఆర్టీసీ బస్టాండ్, నర్సంపేట బైపాస్‌రోడ్డు మీదుగా వీఆర్‌ఎన్ గార్డెన్‌కు చేరుకుంటారని చెప్పారు. అక్కడ నిర్వహించే బీజేపీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొని ప్రసంగించనున్నట్లు చెప్పారు. రాంచందర్‌రావుతో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు, మాజీ రాజ్యసభ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు, మాజీ ఎంపీ అజ్మీర సీతారాంనాయక్ హాజరవుతున్నట్లు చెప్పారు.



కార్డన్‌సర్చ్‌లో పట్టుబడిన వాటిని చూపిస్తున్న సీఐ సూర్యప్రకాష్

అక్రమవ్యాపారాలు నిర్వహిస్తే చర్యలు తప్పవు

● గూడూరు సీఐ సూర్యప్రకాష్

గూడూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో బెల్లం, రేషన్‌బియ్యం, గుట్కా, అంబర్, గుడుంబా, మద్యం లాంటి అక్రమవ్యాపారాలకు పాల్పడితే చర్యలు తప్పవని గూడూరు సీఐ సూర్యప్రకాష్ హెచ్చరించారు. గూడూరు మండలం లైన్‌తండాలో మంగళవారం తెల్లవారుజామున పోలీసులు కార్డన్‌సర్చ్ నిర్వహించారు. 200 బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి క్వింటా నల్లబెల్లం, 3 క్వింటాళ్ల పటికను, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈసందర్భంగా సీఐ సూర్యప్రకాష్ మాట్లాడుతూ.. గ్రామాలలోని యువత చెడు అలవాట్లకు బానిసకాకుండ చదువు, క్రీడలపై దృష్టిసారిస్తే బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. తమ పిల్లలు గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడకుండ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు, గంగారం ఎస్సైలు గిరిధర్‌రెడ్డి, రవికుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భర్త మందలించాడని భార్య ఆత్మహత్య

● కేసు నమోదు చేసిన పోలీసులు

బయ్యారం, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : మద్యం మానేయ్యమని భర్త మందలించడంతో మనస్థాపం చెందిన భార్య పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడగా మంగళవారం బయ్యారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నారు. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం భీమ్లాతండా గ్రామానికి చెందిన బాబోత్ రెడ్డి బుచ్చి దంపతుల కుమారుడు సుమారు 15 ఏళ్ల క్రితం చనిపోయాడు. ఎదిగిన కొడుకు హటాత్తుగా చనిపోవడాన్ని తట్టుకోలేని తల్లి బుచ్చి (38) మద్యానికి బానిసైంది. మానిపించేందుకు భర్త చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఈ క్రమంలోనే ఈ నెల 28న సోమవారం నాడు మద్యం మానెయ్యమని భర్త రెడ్డి తన భార్య బుచ్చిని గట్టిగా మందలించాడు.

దీంతో మనస్థాపం చెందిన బుచ్చి సోమవారం సాయంత్రం పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయానికి పాల్పడింది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు బుచ్చి ని చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న బుచ్చి ఆరోగ్య పరిస్థితి విషమంచడంతో మంగళవారం మృతి చెందింది. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

హేమాచలుడి హుండీ ఆదాయం 9.18 లక్షలు



కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

మంగపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా మంగపేట మండలంలోని మల్లూరు లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో హుండీ లెక్కింపు మంగళవారం జరిగింది. తొమ్మిది హుండీలను తెరచి మే 20 నుంచి ఈనెల 28 వరకు వచ్చిన కానుకలను లెక్కించారు. వీటి ద్వారా ఆలయానికి రూ. 9,18,310 ఆదాయం సమకూరగా కొన్ని విదేశీ కరెన్సీలు కూడా ఉన్నాయని ఈవో సత్యనారాయణరావు తెలిపారు. ఈ హుండీలను హైదరాబాద్, మణుగూరు, పాల్వంచ, సాంబయ్యగూడెం, గోవిందరావుపేట, ఏటూరునాగారం తదితర ప్రాంతాలకు చెందిన 86 మంది సిబ్బంది పాల్గొన్నారు. ఈవో సత్యనారాయణరావుతోపాటు ప్రధాన అర్చకుడు ముక్కమళ్ల రాజశేఖరశర్మ పర్యవేక్షించారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ

మహదేవపూర్, జూలై 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులో సృజనాత్మకతను వెలికి తీస్తే చదువులో వారు అద్భుతాలు సృష్టిస్తారని భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ తెలిపారు. మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థిని అక్షయ భౌతిక శాస్త్రంలో న్యూటన్ సిద్ధాంతాలపై నిర్వహించిన దశావతారంపై నిర్వహించిన వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. విద్యార్థిని అక్షయను అభినందించారు. ప్రతి విద్యార్థి పాఠశాల స్థాయి నుంచి లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో ముందుకు వెళ్తే విజయాలు సాధిస్తామని అన్నారు. అనంతరం కనుబొమ్మలతో మహదేవపూర్ ఎనిమిదో తరగతి విద్యార్థులు చేసిన కోడింగ్‌ను వీక్షించారు. ఈ టెక్నిక్ ద్వారా మాటలు, పాటలు, సాంకేతిక భాషల అవసరం లేకుండా కనుబొమ్మల కదలికలతోనే పాఠాన్ని గ్రహించి కచ్చితంగా చెప్పగలగడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థిని అక్షయను వండర్ బుక్ వరల్డ్ రికార్డు ప్రశంసాపత్రాన్ని, మెడల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ఇండియా చీఫ్ కో ఆర్డినేటర్ బింగి నరేందర్, రాష్ట్ర కో ఆర్డినేటర్ అరుణ్ కుమార్, హెచ్‌ఎం రాజేందర్, పీఏసీఎస్ చైర్మన్ చల్ల తిరుపతిరెడ్డి, తహసీల్దార్ రామారావు, ఎంఈవో ప్రకాశ్ బాబు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని అక్షయకు ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

ఇంటింటి నుంచి సేకరించిన వ్యర్థాలను దహనం చేయడం వల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు ఉత్తమ ఎరువుగా వినియోగించుకోవచ్చని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. కాళేశ్వరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అంటువ్యాధుల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యసేవలను పరిశీలించారు. అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన వ్యర్థాల దహన వాటికను పరిశీలించారు. సరస్వతి ఘాట్ వద్ద గోదావరి ఉధృతిని పరిశీలించారు. గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోందని, స్నానాలు చేసే భక్తులను అందులోకి వెళ్లనీయకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో స్థానిక రెవెన్యూ అధికారులను కంట్రోల్ రూమ్ 9030632608 నంబర్‌లో సంప్రదించాలన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ రామారావు, కాళేశ్వరం ఆలయ ఈవో మహేష్ తదితరులు ఉన్నారు. కాళేశ్వరం జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆ గ్రామానికి చెందిన కోలా శాన్వి, గంట హరిచందన, నాగుల తులసి రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికైనందును కలెక్టర్ అభినందించారు.

వరినాట్లు వేసిన వ్యవసాయాధికారులు



రైతులతో కలిసి వరినాట్లు వేస్తున్న వ్యవసాయాధికారులు

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : రైతులు, వ్యవసాయ కూలీలతో మమేకమై వ్యవసాయాధికారులు వరినాట్లు వేసి ఉత్తేజపరిచిన సంఘటన మహబూబాబాద్ జిల్లా శనిగపురం శివారు చెరువుముందు తండాలో మంగళవారం జరిగింది. జిల్లాలో వర్షాలు పడుతుండడంతో వరి నాట్లు ముమ్మరం కావడంతో జిల్లా వ్యవసాయాధికారి అజ్మీర శ్రీనివాసరావు వ్యవసాయాధికారులతో కలిసి జిల్లాలో వరినాట్ల పరిశీలనకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటి వరకు 65 వేల ఎకరాల్లో వరినాట్లు పడ్డాయని తెలిపారు. వరినారుమడిలో నాటు వేసిన ఏడు నుంచి ఎనిమిది రోజుల ముందు ఒక ఎకరం నారుమడికి ఒక కేజీ కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు వేసుకోవాలని సూచించారు. తద్వార వరిలో కాండం తొలిచే పురుగును ఆశించకుండ అరికడుతుందని చెప్పారు. నారు పోసిన 20 నుంచి 25 రోజుల తర్వాత నాటు వేసుకోవడం వల్ల అధిక పిలకలు వస్తాయని, చదరపుమీటర్ పరిధిలో 33 కుదుర్లు ఉండే విధంగా వేసుకోవాలని చెప్పారు. అధిక దిగుబడి పెరుగుతుందన్నారు. జింక్ లోపం ఉన్నట్లయితే ఎకరాకు 10 కిలోల జింక్ సల్ఫేట్, 21 శాతం నాటు వేసే ముందు దుమ్ము చేసుకోవాలని చెప్పారు. ఆగస్టు 15 లోపు నాట్లు పూర్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎస్.తిరుపతిరెడ్డి, ఏవో టెక్నికల్ రాజు, మోహన్, ఏఈవో సాయిప్రకాష్, రైతులు వాంకుడోతు భద్రు, వీరు, రాము పాల్గొన్నారు.



నాగదేవతను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

నాగదేవత ఆలయ అభివృద్ధికి కృషి

● ఎమ్మెల్యే సత్యనారాయణరావు

మొగుళ్లపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామంలోని నాగదేవత ఆలయాన్ని అభివృద్ధి చేస్తానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. నాగుల పంచమి సందర్భంగా మంగళవారం ఆయన నాగదేవత ఆలయాన్ని సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగదేవత ఆలయంతోపాటు చుట్టూ ప్రహరీగోడ నిర్మాణం కోసం రూ.10లక్షలు కేటాయిస్తానని అన్నారు. మరిన్ని నిధులు కేటాయించి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం గ్రామస్థులు ఎమ్మెల్యేను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు దండా వెంకటేశ్వర్ రెడ్డి, చిట్యాల ఏఎంసీ వైస్ చైర్మన్ ఎమ్డీ.రఫీ, పార్టీ మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి, నాయకులు నరహరి లక్కిరెడ్డి, తక్కళ్లపల్లి రాజు, సుమన్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతు పనులను ప్రారంభిస్తాం

ఆర్అండ్‌బీ ఎస్ఈ రాఘవరెడ్డి

వెంకటాపురం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రం నుంచి ఎదిర పంచాయతీ వరకు ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డు మరమ్మతు పనులను ప్రారంభిస్తామని ఆర్ అండ్‌బీ ఎస్ఈ రాఘవరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మండలంలో పర్యటించి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మండలంలోని వీరభద్రవరం, బోదాపురం వంతెనలను పరిశీలించామని, కుక్కతోగు వంతెన పైనుంచి భారీ వాహనాలు, ఇసుక లారీలు ఎక్కువ సంఖ్యలో వెళ్తుండడంతో వైబ్రేషన్ ఎక్కువైందని అన్నారు. వంతెనను పూర్తిస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. 40 సంవత్సరాల క్రితం నిర్మించిన వంతెనలను తరచూ తనిఖీ చేస్తామని తెలిపారు. మండలంలో ఆర్అండ్‌బీ రోడ్లు గుంతలమయంగా మారాయని, రోడ్ల మరమ్మతు పనుల కోసం రూ.2కోట్ల నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. టెండరు ప్రక్రియ పూర్తయిన వెంటనే రోడ్ల మరమ్మతు పనులను ప్రారంభిస్తామని వెల్లడించారు. రోడ్ల రీ కన్‌స్ట్రక్షన్ కోసం రూ.44కోట్లతో ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించామని, అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. కాగా, పీఏసీఎస్ అధ్యక్షుడు చిడెం మోహన్‌రావు ఎస్ఈని కలిసి రోడ్లు గుంతలమయంగా ఉండడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని కోరారు. ఈఈ సాంసింగ్, డీఈ వెంకటరమణ పాల్గొన్నారు.

కాజీపేట మీదుగా వీక్లీ స్పెషల్ రైళ్లు రద్దు

కాజీపేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : సౌత్ ఈస్టన్ రైల్వేలో జరుగుతున్న అభివృద్ధి పనుల దృష్ట్యా కాజీపేట మీదుగా నడిచే వీక్లీ స్పెషల్ రైళ్లను రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. (17007) చర్లపల్లి - దర్భంగా మీదుగా నడిచే దర్భంగా ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 26న, సెప్టెంబరు 9న రద్దుచేశారు. ఇదే రైలు డౌన్‌లో ఆగస్టు 29న, సెప్టెంబరు 12న రద్దుచేశారు. (17005) హైదరాబాద్ - రక్సోల్ మధ్య నడిచే రక్సోల్ ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 21, సెప్టెంబరు 12న రద్దుచేశారు. డౌన్‌లో ఆగస్టు 24, 31వ తేదీలలో రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు.

ఆర్టీసీ బస్సులోంచి పడి మహిళకు గాయాలు

కృష్ణకాలనీ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రం లోని మంజూర్‌నగర్‌లో మంగళవారం ప్రమాదం చోటు చేసుకుంది. పరకాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో భూపాలపల్లికి వస్తున్న మంజూర్‌నగర్‌లోని వేయి క్వార్టర్స్ కాలనీకి చెందిన కనుగూరి కవిత తీవ్రంగా గాయపడింది. ఆమె చేతిలో ఉన్న బ్యాగ్ కిందపడిపోగా ఆమె బస్సులోంచి ఒక్కసారిగా దూకిందని స్థానికులు తెలిపారు. దీంతో తలకు తీవ్రగాయమై రక్తస్రావం కాగా ఆస్పత్రికి తరలించారు. ఆ మహిళ పూర్తి వివరాలు తెలియరాలేదు.

దరఖాస్తుల ఆహ్వానం

మొగుళ్లపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్కిశాల కస్తూర్బాగాంధీ బాలికల కళాశాలలో ఖాళీగా ఉన్న పీజీ సీఆర్టీ సివిక్స్ (పొలిటికల్ సైన్స్), సీఆర్టీ ఇంగ్లిష్ పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ భిక్షైలజ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఆర్టీ ఇంగ్లిష్ కోసం అభ్యర్థులు ఎంఏ ఇంగ్లిష్ లేదా బీఏ ఇంగ్లిష్ లిటరేచర్ తోపాటు బీఈడీ అర్హత కలిగి ఉండాలన్నారు. సివిక్స్ సబ్జెక్టులో ఎంఏ పొలిటికల్ సైన్స్, బీఈడీ అర్హత కలిగి ఉండాలన్నారు. అర్హులైన మహిళా అభ్యర్థులు ఆగస్టు 1వతేదీలోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని ఆమె వివరించారు.

ఎస్సీ కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బొడ్డు స్మరణ్

కాటారం, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కాలనీల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డు స్మరణ్ డిమాండ్ చేశారు. కాటారం ఎస్సీ కాలనీని ఆయన మంగళవారం సందర్శించారు. వీధిలైట్లు వెలగకపోవడంతో పాములు, తేళ్లు వచ్చి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాజకీయ నాయకులకు ఎన్నికల సమయాల్లోనే ఎస్సీలు గుర్తుకొస్తారా? అని ప్రశ్నించారు. సమస్యలు పరిష్కరించిన వాళ్లకే స్థానిక ఎన్నికల్లో ప్రజలు మద్దతు ఉంటుందన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు సతీష్‌రెడ్డి

గూడూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షులు మిర్యాల సతీష్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గూడూరు మండల కేంద్రంలో మంగళవారం పీఆర్టీయూటీఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఎస్ రద్దు కోసం ఉపాధ్యాయులంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏ, పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 1న మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో జరుపతలపెట్టిన దర్నాను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం నూతనంగా జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన మిర్యాల సతీష్‌రెడ్డి, డాక్టరేట్ పొందిన గోపీనాథ్‌ను మండల శాఖ ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు రవిచంద్ర, వెంకటేశ్వర్లు, రాష్ట్ర, జిల్లా నాయకులు శ్రీధర్, బాలయ్య, లక్ష్మాపతి, మురళీధర్, పగడయ్య, కమలాకర్, కృష్ణమూర్తి, రమేష్, లక్ష్మయ్య, గోపినాథ్, ఆనంద్, నవీన్, విజయ్ పాల్గొన్నారు.



అయోధ్యపురంలో సభ్యత్వ నమోదులో పాల్గొన్న నాయకులు

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి

చిట్యాల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని డీటీఎఫ్ భూపాలపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి విమర్శించారు. చిట్యాల మండలంలోని ఉన్నత పాఠశాలలు, కేజీబీవీల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈసందర్భంగా ఆయా పాఠశాలల్లో తిరుపతి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న విద్యారంగ సమస్యలు పరిష్కరించడం, పీఆర్సీ అమలు, పాత పెన్షన్ పునరుద్ధరణ, పెండింగ్ బిల్లుల చెల్లింపులలో ఎలాంటి పురోగతి కనిపించడం లేదన్నారు. విద్యాశాఖలో ఖాళీగా ఉన్న డీఈవో, డిప్యూటీ డీఈవో పోస్టుల భర్తీ, కేజీబీవీ, సమగ్రశిక్ష ఉద్యోగులు, మోడల్ స్కూల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన ప్రజాప్రతినిధులు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ పిలుపు మేరకు ఆగస్టు 1న జిల్లా కేంద్రంలో నిర్వహించే ధర్నాకు ఉపాధ్యాయ, ఉద్యోగులు అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి ప్రభాకర్, రాష్ట్ర బాధ్యులు వీరేశం, సుదర్శన్, వెంకటరాం నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరంలో తగ్గిన గోదావరి నీటిమట్టం



కాళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం

మహదేవపూర్, జూలై 29(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని త్రివేణి సంగమం వద్ద గోదావరి తగ్గుముఖం పట్టింది. 8.89 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది. ఎగువన ప్రాణహిత నది వరద తగ్గడంతో గోదావరి నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టింది. తెలంగాణలోనూ వర్షాలు తగ్గడంతో నదికి వరద ఉధృతి తగ్గిందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

ఎలక్ట్రికల్ బస్సుల విస్తరణకు సహకరించాలి

కేంద్రాన్ని కోరిన ఎంపీ కావ్య

హనుమకొండ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎలక్ట్రికల్ బస్సుల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య కోరారు. పీఎం ఈ-డ్రైవ్ పథకం కింద తెలంగాణ రాష్ట్రానికి 2,800 ఎలక్ట్రికల్ బస్సులు మంజూరు ప్రతిపాదనను ఆమోదించాలని కావ్య విజ్ఞప్తి చేశారు. ఎలక్ట్రికల్ బస్సుల ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పర్యావరణ రక్షణతో పాటు తెలంగాణ రవాణా రంగానికి నూతన శక్తినిస్తాయని ఎంపీ పేర్కొన్నారు. కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ స్పందిస్తూ, ప్రామాణిక జీసీసీ మోడల్‌ను మాత్రమే కేంద్రం ఆమోదిస్తోందని తెలిపారు.

రాష్ట్రం సూచించిన హైబ్రిడ్ మోడల్ ప్రస్తుత పథకంలో లేనందున ఇంకా పరిశీలనలో ఉందని చెప్పారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. రాష్ట్రం తరుపున మరిన్ని అంశాలు లేవనెత్తుతూ కేంద్రం రాష్ట్ర అవసరాలకు అను గుణంగా విధానాల్లో మార్పులు చేయాలని అభ్యర్థించారు. అందులో భాగంగా తెలంగాణ రాష్ట్రం పక్షాన 2800 ఎలక్ట్రిక్ బస్సుల ప్రతిపాదన కోరారు. హైబ్రిడ్ జీసీసీ మోడల్ ద్వారా ఉపాధికి మద్దతు కల్పించాలన్నారు. సీఈఎస్ఎల్ ఆధ్వర్యంలో బస్సుల కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని ఈ సందర్భంగా ఎంపీ కావ్య కోరారు.

నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్

కృష్ణకాలనీ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడిగా కురిమిళ్ల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. భూపాలపల్లిలో మంగళవారం జరిగిన జిల్లాలోని సమావేశంలో జిల్లాలోని 12 మండలాల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొని జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. భూపాలపల్లి పట్టణానికి చెందిన కురిమిళ్ల శ్రీనివాస్ జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా మొగుళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన నడిగొట్ల రామును ఎన్నుకున్నారు.



సింగరేణి పాఠశాల విద్యార్థులతో బెంగళూరుకు చెందిన అధికారులు

మినీ ల్యాబ్‌ను సందర్శించిన బెంగళూరు అధికారులు

కృష్ణకాలనీ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సింగరేణి పాఠశాలలో నేషనల్ స్టెమ్ సంస్థ సహకారంతో నడుస్తున్న మినీ ల్యాబ్‌ను బెంగళూరుకు చెందిన ప్రతినిధులు ఎస్.నాగదేవ్, శ్రీకాంత్ మంగళవారం సందర్శించారు. మినీ ల్యాబ్‌కు సంబంధించి ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకరావాలని అన్నారు. ల్యాబ్ మూలంగా జిల్లా సైన్స్ ఫేర్‌లోని మ్యాథ్స్ విభాగంలో నేషనల్ స్టెమ్‌కు విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీరాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు శ్యాంసుందర్, కాపూరి మారుతి, అసోసియేషన్ నాయకులు ఎంపీరావు, జనగాం రాయమల్లు, మండల శ్రీనివాస్, దాసరపు సంజీవరావు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వామ్మో.. గుంతలు..

- అధ్వానంగా వరంగల్ నగర రోడ్లు
- వర్షానికి గుంతలైన ప్రధాన రహదారులు


ధ్వంసమైన పోతన నగర్ రోడ్డు

వరంగల్ కార్పొరేషన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో ఇటీవల విస్తారంగా కురిసిన వర్షాలకు ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్లు ప్రమాదకరంగా మారాయి. ఈ రోడ్లపై వాహనాలతో ప్రయాణించే ప్రజలు బయటకు వెళ్లి తిరిగి వస్తారనే గ్యారెంటీ లేదు. రోడ్లను దూరం నుంచి చూస్తే బాగానే ఉన్నా దగ్గరికి వెళ్లే సరికి ఎక్కడ చూసినా ప్రాణాంతక గుంతలు, మోకాలులోతు గుంతలు ఉంటున్నాయి. దీంతో వాహనచోదకులు, కార్లు, భారీ వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇలా నిత్యం ప్రధాన రహదారులపై ప్రమాదాలు జరుగుతున్న ఘటనలు నిత్యకృత్య మయ్యాయి. స్మార్ట్‌సిటీ, జనరల్ ఫండ్‌తో పాటు ఇతర నిధుల నుంచి కోట్లు ఖర్చు చేసి నగర రోడ్లను అద్దంగా తీర్చి దిద్దాల్సిన అధికారులు.. నిద్రమత్తు నటిస్తుండడంతో కాంట్రాక్టర్లు నాసిరకం పనులు చేసినట్టు వర్షంతో వెలుగులోకి వచ్చింది. ఈ వారం వ్యవధిలో కురిసిన భారీ వర్షాలకు రోడ్లపై ఏర్పడిన గుంతల్లో పడి సుమారు 22 మంది చికిత్స పొందుతున్నట్టు తెలిసింది.


అంబేద్కర్ భవన్ వద్ద రోడ్డుపైనే ఉన్న మట్టి కుప్పలు, రాళ్లు

గుంతలమయమైన ప్రదేశాలు

వరంగల్ నగరం పాలక సంస్థ పరిధిలోని పోతననగర్‌రోడ్డు, విజ్ఞాన్ ముందు రోడ్డు, గోపాల్‌పూర్ జంక్షన్, ఖమ్మం ఓవర్ బ్రిడ్జి ప్రాంతం, ఖమ్మం ఫ్లైఓవర్ బ్రిడ్జి, వరంగల్ బస్‌స్టేషన్, అంబేద్కర్ భవన్ ముందు, కేయూ రోడ్డు, యాదవ నగర్, రమేష్‌బార్ ముందు, ములుగురోడ్డు జంక్షన్, హనుమాన్‌నగర్ జంక్షన్, భీమారం జంక్షన్, వరంగల్ 12 మోరీల జంక్షన్, శివనగర్‌రోడ్డు, కరీమాబాద్‌రోడ్డు, మడికొండ జంక్షన్, బాపూజీనగర్ వద్ద రోడ్లు వర్షానికి పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. గ్రేటర్ వరంగల్ అధికారులు గుంతలను గుర్తించి ప్రత్యేక బడ్జెట్‌తో ప్యాచ్ వర్క్‌లు చేసి సమస్య పరిష్కరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ వద్ద తెరచి ఉన్న మ్యాన్‌హోల్


ఖమ్మం ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై ధ్వంసమైన రోడ్డు



శానిటరీ ఇన్‌స్పెక్టర్ల అక్రమ దందా

- బల్దియాలో జవాన్లతో వసూళ్లు
- రీషఫిల్ చేసినా మారని తీరు
- పీహెచ్ వర్కర్లనూ వదలని వైనం
- ఒకరికి బదులు మరొకరు విధులు

వరంగల్ కార్పొరేషన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలోని 66 డివిజన్లతో పాటు మెయిన్ రోడ్లపై ప్రజాపాలన విభాగం శానిటరీ ఇన్‌స్పెక్టర్ల అక్రమాలు పెరిగిపోతున్నాయి. వారి చేతికి మట్టి అంటకుండా కొందరు జవాన్లను ఎంపిక చేసుకుని వారి చేత అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా ట్రై సిటీస్‌లోని పెద్ద హోటళ్లు, దాబాలు, బార్లు, రెస్టారెంట్లు, కమర్షియల్ కాంప్లెక్స్, షాపింగ్ మాల్స్ నుంచి నెల వారీగా ఇచ్చే చెత్త పన్ను కాకుండా అదనంగా అడ్డదారిలో గార్బేజ్ పన్ను వసూలు చేస్తున్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. కొందరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు అక్రమ చెత్త పన్నుతో పాటు 66 డివిజన్లలో పని చేసే పబ్లిక్ హెల్త్ (పీహెచ్) వర్కర్లతో పాటు ప్రభుత్వ శానిటరీ ఉద్యోగుల నుంచి నెల వారీగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. డబ్బులు ఇవ్వబోమని తెగేసి చెప్పేవారికి కష్టమైన పనులు పురమాయిస్తున్నారు. వారితో డ్రెయినేజీలు శుభ్రం చేయించడం, జంతు కళేబరాలు తరలించడం, మెయిన్ రోడ్లు ఊడ్పిస్తారని కార్మికులు చెబుతున్నారు. కొందరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శాశ్వతంగా కొందరు పీహెచ్ వర్కర్లను జవాన్లుగా ఎంపిక చేసి వారికి పదోన్నతులు కల్పిస్తూ వసూళ్లకు పాల్పడుతున్నట్లు జోరుగా ప్రచారం సాగుతుంది.

ఎక్కువ డివిజన్లు.. తక్కువ ఇన్‌స్పెక్టర్లు

గ్రేటర్ శానిటేషన్ విభాగంలో 1 సీఎంహెచ్‌వో, 1 ఎంహెచ్‌వో, 2 శానిటరీ సూపర్‌వైజర్లు, 7 ఒరిజినల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, 5 మలేరియా విభాగం నుంచి ఎంపిక చేసిన డిప్యుటేషన్ ఇన్‌స్పెక్టర్లు, 1 ఫారిన్ సర్వీస్ (మెడికల్ డిపార్ట్‌మెంట్)కు సంబంధించిన అధికారులు పని చేస్తున్నారు. ఉద్యోగ నియామకాల కుంభకోణంలో ఇరుక్కున్న ఓ ఇన్‌స్పెక్టర్ సైతం ఖమ్మం నుంచి ఇటీవల తిరిగి జీడబ్ల్యూఎంసీ శానిటేషన్ విధుల్లో చేరి చర్చనీయాంశంగా నిలిచాడు. చాలాకాలంగా పాతుకుపోయిన 13 మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఇటీవల 66 డివిజన్లకు రీషఫిల్ చేశారు.

ఐనా వారి ప్రవర్తనలో మార్పు రాకుండా వారి వద్ద గతంలో పర్మినెంట్‌గా పని చేసి అక్రమ వసూళ్లకు పాల్పడిన వారిని సైతం వారి వెంటే తీసుకుని వెళ్లినట్లు ప్రచారం జరుగుతుంది. ఐతే కొందరు ఉన్నతాధికారులతో చనువుగా ఉన్న ఇన్‌స్పెక్టర్లకు వారు కోరుకున్న డివిజన్లు, 6 కమర్షియల్ మెయిన్ రోడ్లను అప్పగించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రస్తుతం గ్రేటర్ పరిధిలో 250 మందికి పైగా వైట్‌కాలర్ జవాన్లు డ్యూటీకి హాజరు కాకుండా పర్సనల్ పనులు చేసుకునే ప్రభుత్వ (పీహెచ్) వర్కర్ల వద్ద నెలకు రూ. 10 వేలు, ఔట్ సోర్సింగ్ కార్మికుల నుంచి నెలకు రూ. 500 నుంచి వెయ్యి వసూలు చేస్తున్నట్లు తెలిసింది. అలాగే బదిలీ వర్కర్‌ను పెట్టినట్లు ఆయా డివిజన్లలో పని చేస్తున్న కొందరు జవాన్లు అధికారులు, కమిషనర్‌ను సైతం తప్పుదోవ పట్టిస్తూ నెలకు లక్షల్లో వెనకేసుకోవడంతో పాటు డివిజన్ ఇన్‌స్పెక్టర్‌కు నెలకు రూ. 1 లక్ష ఇస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఒక్కో డివిజన్‌లో సుమారు 25 నుంచి 35 మంది శానిటేషన్ కార్మికులు పని చేయాల్సి ఉండగా ప్రస్తుతం 10 మంది కంటే ఎక్కువ చేయడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో పని చేసే సిబ్బంది మీదనే అదనపు భారం పడడం వల్ల రోగాల బారిన పడుతున్నారు.

కమిషనర్ గారు.. జర దేఖోజీ

గతంలో ఉన్న అధికారులు శానిటేషన్ విభాగంపై దృష్టి సారించపోవడంతో సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు ఆడిందే ఆట పాడిందే పాటగా డ్యూటీ చేశారు. కానీ కొత్త కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ వచ్చిన తర్వాత కూడా వారి విధుల పట్ల దృష్టి సారించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. వారి పని విధానంలో మార్పు రాకపోతే వరంగల్ నగరం చెత్త కుప్పలా మారిపోతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

జవాన్ల డ్యూటీ చేస్తున్న సూపర్‌వైజర్లు

వరంగల్ శానిటేషన్ విభాగంలో పని చేస్తున్న ఇద్దరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నగరంలో జవాన్ల డ్యూటీలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. హైదరాబాద్ తర్వాత అతి పెద్ద నగరమైన వరంగల్ బల్దియాకు కనీసం 6 శానిటరీ సూపర్‌వైజర్లు పని చేయాల్సి ఉంది. కాని ఇక్కడి అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రస్తుతం ఇద్దరే పని చేస్తున్నారు. ఆ ఇద్దరు తలో నాలుగు డివిజన్లు, మెయిన్ రోడ్లను పంచుకుని వర్కర్ల నుంచి జవాన్ల ద్వారా అందిన కాడికి దండుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రతిరోజూ శానిటరీ సూపర్‌వైజర్లు డివిజన్లలో పర్యటిస్తూ అక్కడి సమస్యలు గుర్తించి ఆయా డివిజన్ల శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లకు పనులు అప్పగించాల్సి ఉంటుంది. కానీ సూపర్‌వైజర్లు అడ్డదారిలో వచ్చే డబ్బులకు ఆశపడి వారి స్థాయిని తగ్గించుకుని జవాన్ డ్యూటీలు చేస్తున్నారని కింది స్థాయి సిబ్బంది ఆరోపిస్తున్నారు.

ఎలుకల మందు తాగి విద్యార్థి ఆత్మహత్య

పాఠశాల వద్ద బంధువులు ఆందోళన


వెంకట చైతన్య (ఫైల్)

తొర్రూరు రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఎలుకల మందు తాగి 10వ తరగతి చదువుతున్న విద్యార్థి బానోత్ వెంకట చైతన్య (15) మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం వెలిశాల గ్రామ శివారు మర్రికుంట తండాకు చెందిన వెంకన్న-అనిత దంపతుల కుమారుడు వెంకట చైతన్య తొర్రూరు మండలం వెల్లికట్టె గ్రామ శివారులోని అభ్యాస్ పాఠశాలలోని హాస్టల్‌లో ఉంటూ పదవ తరగతి చదువుతున్నాడు. మూడు రోజులుగా ఒంటరిగా ఉంటూ, నిత్యం ఆన్‌లైన్ ద్వారా వచ్చిన పుస్తకాలు చదువుతూ, స్నేహితులకు దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలో ఈ నెల 27న రాత్రి హాస్టల్‌లో ఎలుకల మందు తాగడం గమనించిన తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు వెంటనే స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యంతో కలిసి వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా, పరిస్థితి విషమించింది. సోమవారం రాత్రి హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించినట్లు తెలిపారు. దీంతో ఆగ్రహించిన తల్లిదండ్రులు మృతికి గల కారణాలు తెలియజేయాలని పాఠశాల ఎదుట మృతదేహం వేసి ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న సీఐ గణేష్, ఎస్సై ఉపేందర్ ఘటన స్థలానికి చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడి ఆందోళన విరమింప చేశారు. తన కుమారుడి మృతికి గల కారణాలు తెలియజేయాలంటూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం వర్ధన్నపేట ఏరియా ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

ఆయుర్వేద వైద్య కళాశాలలో 10 సీట్లు కోత

ఫ్యాకల్టీ కొరతతో తగ్గించిన వైద్య కమిషన్

గిర్మాజిపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో వరంగల్ అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా సీట్లను కోల్పోయింది. మొత్తం 63 బీఏఎంఎస్ సీట్లకు ఈ ఏడాది (2025-26)ప్రవేశాలకు 10 సీట్లను తగ్గిస్తూ నేషనల్ కమిషన్ ఫర్ ఇండియన్ సిస్టమ్ ఆఫ్ మెడిసిన్ (ఎన్సీఐఎస్ఎం) ఆదేశాలు జారీ చేసింది. నిబంధనల ప్రకారం కళాశాలలో ఫ్యాకల్టీతో పాటు మౌలిక సదుపాయాలు లేనందున సీట్లు తగ్గిస్తున్నట్లు వైద్య కమిషన్ పేర్కొంది. గతేడాది కూడా ఇవే కారణాలతో 4 సీట్లను తగ్గించిన విషయం తెలిసిందే. కాగా, 'ఆయుర్వేద వైద్య కళాశాలల్లో సీట్లకు గండి' శీర్షికన మంగళవారం 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించిన విషయం విదితమే. అందులో చెప్పినట్లుగానే 10 సీట్లు తగ్గాయి. అయితే 10 సీట్లకు కోత పడటంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి కేంద్ర ప్రభుత్వస్థాయిలో వైద్య కమిషన్‌తో చర్చించి తగిన హామీ ఇస్తే కోల్పోయిన 10 సీట్లు వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ విషయంలో మంత్రి కొండా సురేఖ ప్రత్యేక చొరవ తీసుకొని వైద్య కళాశాల సీట్లను కాపాడాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.


అమ్మవారికి చీరె సారె సమర్పిస్తున్న భక్తులు

భద్రకాళి అమ్మవారికి చీరెసారె సమర్పణ

51 రకాల స్వీట్లు, పండ్లతో పూజ

వరంగల్ కల్చరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఓరుగల్లు ప్రజల ఇలవేల్పు భద్రకాళి అమ్మవారికి శ్రావణ మాసం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రీలక్ష్మి శ్రీనివాస సేవా ట్రస్టు మహబూబాబాద్ అధ్యక్షుడు బి. కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో 300 మంది భక్తులు వరంగల్ పోచమ్మమైదాన్ నుంచి మేళతాళాలతో చీరె సారెతో ఆలయానికి తరలి వచ్చారు. అమ్మవారిని దర్శించుకొని 51 రకాల స్వీట్లు, వివిధ రకాల పండ్లతో పాటు చీరె సారె సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బి.శివసుబ్రహ్మణ్యం, ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, గాదె శ్రవణ్‌కుమార్‌రెడ్డి, ఓరుగంటి పూర్ణచందర్, తొగరు క్రాంతి, బింగి సతీష్, స్రవంతి, సుగుణ, అంజనేయులు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, ఈవో శేషు భారతి, అర్చకులు భద్రకాళి శేషుతో పాటు భట్టి శ్రీనివాస్, భార్గవి, కార్పొరేటర్లు చాడా స్వాతి రెడ్డి, దేవరకొండ విజయలక్ష్మి, సురేందర్, హేమలత, నాగజ్యోతి, రజినీరెడ్డి, వనజ తదితరులు పాల్గొన్నారు.

పరకాలను జిల్లాగా ఏర్పాటు చేయాలి

- మహిళలను కోటీశ్వరులను చేస్తాం : పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి
- ప్రజలు సహకారంతోనే పట్టణాభివృద్ధి : హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్



పారిశుధ్య కార్మికురాలికి దుస్తులు అందిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి, కలెక్టర్ స్నేహ శబరీష్

పరకాల, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : పరకాలను అమరవీరుల జిల్లాగా ఏర్పాటు చేయాలని, గత పాలకుల నిర్లక్ష్యంతో పరకాలకు అన్యాయం జరిగిందని స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. పరకాల పట్టణ కేంద్రంలోని మునిసిపల్ కార్యాలయంలో మంగళవారం ఎక్స్‌కవేటర్, ఆరు స్వచ్ఛ ఆటోలను కలెక్టర్ స్నేహ శబరీష్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫెడ్ ఫెస్టివల్ స్టాళ్లను అధికారులతో కలిసి సందర్శించారు. మహిళా సంఘాల ఉత్పత్తుల ప్రదర్శన, స్టాళ్లను పరిశీలించారు. అలాగే వన మహోత్సవంలో భాగంగా అధికారులతో కలిసి మొక్కలు నాటారు. మునిసిపల్ కార్మిక సిబ్బందికి దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే రేవూరి మాట్లాడుతూ.. మైనింగ్ ఏరియా భూపాలపల్లి వంటి ప్రాంతాలను జిల్లాగా ఏర్పాటు చేశారని కొంత కాలం తర్వాత ఆ ప్రాంతాల్లో జనసంచారం ఉండదన్నారు. పరకాలకు అన్ని రకాలుగా అర్హత ఉందన్నారు. పరకాలలో స్కిల్ డెవలప్‌మెంట్ ఏర్పాటు చేయబోతున్నట్లు పేర్కొన్నారు. పీయూఎఫ్ ఐడీసీ నిధులతో డీపీఆర్ ద్వారా అభివృద్ధి చేస్తామన్నారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ వచ్చే నెల 2న ప్రారంభిస్తామన్నారు. ఇప్పటికే రూ. 40 కోట్లతో డ్రెయినేజీ, రూ. 11 కోట్లతో రోడ్ల అభివృద్ధి చేస్తున్నామన్నారు. పరకాలకు పూర్వవైభవం తీసుకరావడానికి ప్రజల సహకరించాలని కోరారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరైన వారు త్వరగా ముగ్గులు పోసి నిర్మాణం చేపట్టాలన్నారు. 469 ఇళ్లకు 45 శాతం పురోగతి ఉందన్నారు. 45 రోజులు దాటితే నోటీసులు ఇచ్చి మంజూరు పత్రాలను రద్దు చేస్తామన్నారు. అధికారులు వెంటపడి ఇంటి నిర్మాణం ప్రారంభించాలన్నారు. మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పుల పాలు చేశాడని ఆరోపించారు.

అనంతరం కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. ప్రజలు సహకారంతోనే పట్టణాభివృద్ధి సాధ్యమన్నారు. మహిళలు తడి, పొడి చెత్తను వేరు చేసి సిబ్బందికి అందించాలని కాలనీ వారీగా కంపోస్టు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం మెప్మా సిబ్బందికి శిక్షణ అవసరమని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని మొదలు పెట్టి పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఇల్లు కట్టుకునే వారికి మెప్మా ద్వారా ఆర్థికసాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ఆర్డీవో నారాయణ, కమిషనర్ సుష్మ, తహసీల్దార్ విజయలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ రాజిరెడ్డి, ఎంపీడీవో పెద్ది అంజనేయులు, కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, కట్కూరి దేవేందర్‌రెడ్డి, సోదా రామకృష్ణ, మడికొండ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దిగొచ్చిన సన్న బియ్యం ధరలు

- మధ్య తరగతి కుటుంబాలకు అందుబాటులో..
- సన్న బియ్యం పంపిణీతోనే దిగిన ధరలు
- ప్రభుత్వం 3 నెలల బియ్యం ఇవ్వడంతో తగ్గిన గిరాకీ
- ధరలు తగ్గడంతో తలలు పట్టుకుంటున్న వ్యాపారులు

వర్ధన్నపేట రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : సన్న బియ్యం ధరలు దిగొచ్చాయి. మధ్య తరగతి కుటుంబాలు సన్న బియ్యం కొనాలంటేనే వామ్మో అనేవారు. ప్రస్తుతం ఈ బియ్యం ఆ కుటుంబాలకు అందుబాటులో ఉండేవిధంగా ధరలు ఉన్నాయని బహిరంగ మార్కెట్‌లో వ్యాపారులు, మిల్లర్లు, దుకాణాదారులు చెబుతున్నారు. రేషన్ దుకాణాల ద్వారా ఓ పక్క ప్రభుత్వం సన్న బియ్యం ప్రారంభించడంతో పాటు కేంద్ర ప్రభుత్వం మూడు నెలల పాటు రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయడంతో సన్న బియ్యాన్ని కొనుగోలు చేసే కుటుంబాలు తక్కువై పోయాయి. దీంతో దుకాణాదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ రెండు నెలల్లోనే రూ. 700-1000 వరకు ధరలు పడిపోవడంతో ప్రజలు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

అందుబాటులోకి సన్న బియ్యం ..

సన్న బియ్యం రెగ్యులర్‌గా కొనే వారిలో మధ్య తరగతి కుటుంబాలే ముందు వరుసలో ఉంటాయి. కొంత మంది దుకాణాదారుల వద్ద కిలోల చొప్పున కొనుగోలు చేస్తారు. మరికొంత మంది నేరుగా మిల్లర్ల వద్దే కొనుగోలు చేసుకుంటారు. ప్రస్తుతం సన్న బియ్యం కొనుగోలు చేయాలనుకునే మధ్య తరగతి కుటుంబాలకు అందుబాటులో ఉన్నాయని వ్యాపారులు చెపుతున్నారు. రూ. 5 వేలకు పైగా ధరలు పలికిన సన్న బియ్యం ఇప్పుడు రూ. 4 వేలకు పైగా మాత్రమే పలుకుతున్నాయి. జై శ్రీరాం బియ్యం సైతం రూ. 6 వేల వరకు పలికిన సందర్భంలో ఇప్పుడు రూ. 5వేలకు పడిపోయాయి. ఆర్ఎన్ఆర్, బీపీటీ బియ్యం సైతం రూ. 4 వేలు, కొన్ని చోట్ల ఆ లోపు ధరలతో అమ్మాల్సిన పరిస్థితి వచ్చింది.


వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం దివిటిపెల్లిలోని రైస్‌మిల్‌లో ఉన్న బియ్యం బస్తాలు

రైస్ మిల్లర్లకు తీవ్ర నష్టం

రైస్ మిల్లు వ్యాపారులకు సన్న బియ్యం ధరలు తగ్గడంతో తీవ్ర నష్టం చవిచూస్తున్నారు. సన్నాలు పండించిన రైతులకు సైతం బోనస్‌తో కలిపి దాదాపు రూ. 3 వేల వరకు మద్దతు ధర వస్తుండడంతో బియ్యం ధరలు పెరిగి కొన్ని రోజుల పాటు లాభాలు గడించారు. కానీ ఇప్పుడు సన్న బియ్యాన్ని అడిగే వారు కూడా లేకపోవడంతో మిల్లుల్లో బియ్యం నిల్వలు పెరిగిపోయాయి. కొంత మంది మిల్లర్లు ఇంకా సన్న వడ్లను మరాడించకుండానే పక్కన పెట్టేశారు. సాధారణ మిల్లులు కూడా దాదాపు క్రాప్‌కు వెయ్యి క్వింటాళ్లకు పైగా సన్న వడ్లను కొనుగోలు చేసి అమ్మేవారు. పెద్ద మిల్లర్లు దాదాపు 3000-5000 క్వింటాళ్ల వరకు మరాడించి దుకాణాదారులు, హోటళ్లకు పంపించేవారు. కానీ గత రెండు నెలలుగా మిల్లులు సైతం పని చేయడం మానేశాయి. ప్రభుత్వానికి పంపిద్దామని చూసిన ఇప్పటికే గోదాములు నిండిపోయాయని పంపిస్తే తీసుకోబోమని చెబుతున్నారని సమాచారం.

భారీగా నష్టపోయాం..



వంట కోతలు కాగానే సన్న బియ్యం కోసం మాకు ఆర్డర్లు వచ్చేవి. ఈసారి రేషన్ బియ్యం మూడు నెలల పాటు ఇచ్చే సరికి సన్న బియ్యం కొనేవారు తక్కువయ్యారు. సగానికి పైగా వ్యాపారం పడిపోయింది. మిల్లుల్లోనే సన్న బియ్యం నిల్వలు ఉండిపోయాయి. ఒక్కసారిగా ధరలు తగ్గడంతో ఏం చేయాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వానికి వెళ్లాల్సిన బియ్యం సైతం గోదాముల్లో ఉండిపోయింది.

పెద్దబోయిన శంకర్, మిల్లు యజమాని, వర్ధన్నపేట

బియ్యం ధరల వివరాలు క్వింటాల్(రూ.లలో)

రకం	మే	జూన్/జూలైలో ధర	తగ్గిన ధర
సాంబమసూరి	6000	4700	1300
జైశ్రీరాం	6500	4900	1600
స్టీమ్ రైస్	5000	3900	1100
బీపీటీ	5000	4300	700
ఆర్ఎన్ఆర్	5500	4500	1000

రేపు ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

హసన్‌పర్తి, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సుబ్బయ్యపల్లిలో ఈ నెల 31న సాంఘిక సంక్షేమ గురుకులంలో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ గ్రూపులకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుధాకృష్ణ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రేపు (గురువారం) ఉదయం 9 గంటలకు కళాశాల ప్రాంగణంలో 10వ తరగతి మార్కుల ఆధారంగా సీట్లు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని పేర్కొన్నారు.

స్కూటీపై 120 చలాన్లు

రూ. 32,165 పెండింగ్


పెండింగ్ చలాన్లను చూపుతున్న ట్రాఫిక్ సీఐ వెంకన్న

కాజీపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వాహనాల తనిఖీలో భాగంగా ఓ మాస్ట్రో స్కూటీపై ఏకంగా 120 చలాన్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. కాజీపేట ట్రాఫిక్ సీఐ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేటలోని ఎఫ్‌సీఐ పాయింట్ వద్ద మంగళవారం తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో ఏపీ 36 ఏఎక్స్ 4930 మాస్ట్రో ద్విచక్ర వాహనాన్ని తనిఖీ చేయగా 120 చలాన్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ చలాన్ల విలువ రూ. 32,165 పెండింగ్ ఉన్నట్లు తెలిపారు. సదరు వాహనదారునికి డ్రైవింగ్ లైసెన్స్ కూడా లేదన్నారు. వాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

● రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి



జిల్లా జనరల్ ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న వాసం వెంకటేశ్వరరెడ్డి

మహబూబాబాద్ క్రైం, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : వర్షకాలంలో వ్యాపించే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి, ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్టు డైరెక్టర్ వాసం వెంకటేశ్వరరెడ్డి అన్నారు. జిల్లా ప్రధాన ఆస్పత్రిలో మంగళవారం సందర్శించి ఫీవర్ వార్డు, ఫార్మసీ స్టోర్ ల్యాబ్, సంపూర్ణ సంరక్ష కేంద్రం (ఐసిటిసి) సందర్శించి పరిశీలించారు. నెలసరిగా నమోదు అయ్యే పాజిటీవ్ కేసులను మ్యాన్యువల్, ఆన్‌లైన్ పరంగా నమోదు వివరాలను ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా వైద్యాధికారి, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రావు, ప్రోగ్రాం ఆఫీసర్లతో జరిగిన సమావేశంలో వెంకటేశ్వరరెడ్డి మాట్లాడారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండడమే కాకుండా, అవగాహన పెంచుకోవడం తప్పనిసరన్నారు. ఆస్పత్రులు, పీహెచ్‌సీలకు వైద్యం కోసం వచ్చే బాధితులకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందించి, మందులను పంపిణీ చేయాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు, చుట్టూ ఉన్న ప్రదేశాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సకాలంలో శానిటేషన్ పనులు చేయించాలన్నారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకొనేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పట్టణాలల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ర్యాపిడ్ టెస్టులను నిర్వహించాలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టిపెట్టి సంపూర్ణ ఆరోగ్య జిల్లా సాధనకు జిల్లా అధికారులు కృషి చేయాలన్నారు.

కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా సీజనల్ వ్యాధులు నివారించడానికి అన్ని శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పని చేయాలన్నారు. వైద్య సిబ్బంది ఇంటింటా సర్వే నిర్వహించి ఫీవర్ కేసులను నమోదు చేయాలన్నారు. గ్రామాల్లో, మునిసిపల్ పట్టణాలల్లో సకాలంలో పారిశుధ్యం పనులు చేయించాలన్నారు. ప్రజలు కాచ్చి చల్లార్చిన నీటినే తాగాలని, వేడివేడి ఆహారం తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, ర్యాపిడ్ టెస్టులు నిర్వహించాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో వృధా నీటిని అరికట్టి, దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. అపరిశుభ్రత ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ వేయించాలన్నారు. మునిసిపాలిటీ, పంచాయతీ అధికారులు సమన్వయంగా పని చేసి పారిశుధ్య పనులను క్షేత్రస్థాయిలో పూర్తి చేయాలన్నారు. డిప్యూటీ డైరెక్టర్ నాగరాజు, డీఎంఅండ్‌హెచ్‌వో భూక్యా, రవిరాథోడ్, డీపీవో హరిప్రసాద్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, మహబూబాబాద్ మున్సిపాలిటీ కమీషనర్ రాజేశ్వర్, మాస్ మీడియా ఇంచార్జి ప్రసాద్, ప్రోగ్రాం ఆఫీసర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు అవగాహన కల్పించాలి..

● బయ్యారం : వర్షకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండటమే కాదు ప్రజలకు అవగాహన కల్పించాలని రాష్ట్ర ఏయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్ట డైరెక్టర్ (పీడీ) వెంకటేశ్వర్ రెడ్డి ఆదేశించారు. జగ్రబాద గ్రామాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) రవిరాథోడ్‌తో కలిసి సందర్శించి ఇటీవల డెంగ్యూ సోకి రికవరి అయిన కుటుంబాన్ని పరామర్శించారు. అంతకుముందు బయ్యారం ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం (పీహెచ్‌సీ)ను ఆకస్మికంగా తనిఖీ చేసిన పీడీ రికార్డులను పరిశీలించారు. ఎన్‌సీవీబీడీసీ పీవో సుధీర్‌రెడ్డి, ఎన్‌టీఈపీ పీవో విజయ్‌కుమార్, బయ్యారం పీహెచ్‌సీ వైద్యాధికారి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

42 శాతం రిజర్వేషన్‌లు అమలు చేశాకే ఎన్నికలకు వెళ్లాలి

● మాజీ మంత్రి సత్యవతిరాథోడ్

కురవి, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేశాకే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు వెళ్లాలని మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ డిమాండ్ చేశారు. కురవిలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తడ్రామా మొదలు పెట్టిందన్నారు. ఆరు గ్యారెంటీల హామీలు ఎలాగైతే ఎగ్గొట్టారో ఇప్పుడు బీసీ రిజర్వేషన్లు సైతం కాలయాపన చేసి దాటవేయాలని చూస్తున్నారని విమర్శించారు. స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపునకు ఒకసారి జీవో అని, మరోసారి బిల్లు అని, ఇంకొసారి ఆర్డినెన్స్ అని ప్రభుత్వం నాటకాలు ఆడుతుందని అన్నారు. బీసీలు బాగుపడడం కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇష్టం లేదన్నారు. తాను మంత్రిగా ఉన్న కాలంలో దళిత, గిరిజనుల విద్యార్థులు చదివే హాస్టళ్లను ఎన్నో రెట్లు అభివృద్ధి చేశానని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఏం చేసిందో వెల్లడించాలన్నారు. తొలుత అనారోగ్యంతో బాధపడుతున్న శ్రీరాం జగన్నాథంను పరామర్శించారు. ఆయా కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ నాయకులు బిలు నరహరి, బాదె నాగయ్య, బోడ శ్రీను, నెహ్రూనాయక్, కిశోర్‌వర్మ పాల్గొన్నారు.

మార్కెట్లో కార్మికులకు యూనిఫాంల పంపిణీ

కేసముద్రం, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో 154 మంది కూలీలు, 228 మంది హమాలీ కార్మికులకు రూ.2వేల చొప్పున మంగళవారం యూనిఫాంలను మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి పంపిణీ చేశారు. కార్మికుల సంక్షేమం కోసం మార్కెట్ నిధుల్లోంచి యూనిఫాంలను అందజేస్తున్నట్లు చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో ఇష్టా జిల్లా నాయకులు శివారపు శ్రీధర్, ప్రత్యేక హోదా కార్యదర్శి అమరలింగేశ్వర్‌రావు, కమిటీ సభ్యులు పోలం రమేష్, ఆర్‌టీఏ సభ్యుడు రావుల మురళి, గ్రేడ్‌2 కార్యదర్శి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో తనిఖీ

డోర్నకల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ అనిల్‌కుమార్(రెవెన్యూ) ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల జరిగిన గ్రామ రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులు, వాటి పరిష్కారం గురించి తహసీల్దార్ ఇమ్మాన్యుయేల్‌ను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి సమస్యను పరిష్కరించాలన్నారు. అనంతరం కార్యాలయ సిబ్బంది గురించి అడిగి తెలుసుకున్నారు.

యూరియా కొరత లేకుండా చూడాలి

కురవి, జూలై29 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో రైతాంగానికి యూరియా కొరత లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆత్మ చైర్మన్ నల్లు సుధాకర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు జిల్లా ఇన్‌చార్జ్ వ్యవసాయాధికారి అజ్మీర శ్రీనివాస్‌కు విజ్ఞప్తి చేశారు. వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించకుండా నిరంతరం తనిఖీలు చేయాలని, యూరియా నిల్వ ప్రతిషాపులో బోర్డులపై ప్రదర్శించాలని కోరారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి

మహబూబాబాద్ క్రైం, జూలై29 : (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలపై విద్యార్థుల అవగాహన కలిగి ఉండాలని సైబర్ క్రైమ్ ఎస్సై కరుణాకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, నలంద డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం, షీటీం, భరోసా సెంటర్ సహకారంతో మహిళలు, బాలికల భద్రతపై మంగళవారం విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై కరుణాకర్ మాట్లాడుతూ.. విద్యార్థులు గుడ్ టచ్, బ్యాడ్ టెస్టులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. షీటీం ఎస్సై సునంద, భరోసా ఎస్సై ఝాన్సీ, నలంద కళాశాల ప్రిన్సిపాల్ డోలి సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ బాధ్యులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఆగస్టు 1న ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) ధర్నాను జయప్రదం చేయాలని యూఎస్‌పీసీ స్టీరింగ్ కమిటీ బాధ్యులు యాకూబ్, బలాష్టి రమేష్, దేవేందర్‌రాజు పిలుపునిచ్చారు. మహబూబాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం యూఎస్‌పీసీ ధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. నాయకులు షైన శ్రీనివాస్, మంజుల, సంజీవ, ఉపేందర్, బిక్షపతి, రామలింగారెడ్డి, రాజశేఖర్, నరసింహస్వామి, వెంకటేశ్వర్లు, సురేష్, భీముడు, శ్రీనివాస్, నాగరాజు, కుమారస్వామి పాల్గొన్నారు.

గాంధీపురంలో కార్డన్‌సెర్చ్

మహబూబాబాద్ రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం శివారు గాంధీపురంలో మంగళవారం తెల్లవారుజామున మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య ఆధ్వర్యంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ దాడుల్లో రెండు క్వింటాళ్ల నల్లబెల్లం, మద్యం బాటిళ్లు, 20 లీటర్ల గుడుంబా, 11 పత్రాలు లేని ద్విచక్రవాహనాలు, ఆటోను స్వాధీనం చేసుకుని 300 లీటర్ల బెల్లంపానకం ధ్వంసం చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎవరైనా అక్రమవ్యాపారాలకు పాల్పడితే ఎంతటి వారైన ఉపేక్షించేది లేదన్నారు. గుడుంబా కాచినా, విక్రయించినా, రవాణా చేసినా వారిపై శాఖపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు దీపికరెడ్డి, జితేందర్, కరుణాకర్, పుల్లారావు, నరేష్, రవికిరణ్, మౌనిక, వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఒకరికి ఏడాది జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా

మహబూబాబాద్ క్రైం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసులో ఒకరికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ.10 వేలు జరిమానా విధిస్తూ జిల్లా జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ స్వాతిమురారి తీర్పు వెల్లడించినట్లు కోర్టు కానిస్టేబుల్ సంపత్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం. మహబూబాబాద్ పట్టణంలోని వేల్పుల సత్యనారాయణ కాలనీకి చెందిన పత్తిపాక జనార్ధన్ 2024 ఆగస్టు 28న ఉదయం 8 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఉదయం 11 గంటలకు ఇంటికి వచ్చే సమయానికి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగలగొట్టి ఇంటిలోపల బీరువా లాకర్ ధ్వంసం చేసి, బీరువాలో ఉన్న 20 తులాల వెండి పట్టీలు, అరతులం బంగారు చెవికమ్మలు, రూ.20 వేల నగదు అపహరించారు. బాధితుని నుంచి ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేసిన అప్పటి ఎస్సై విజయ్‌రామ్‌కుమార్ క్షేత్ర స్థాయిలో విచారణ జరపగా మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం, గాంధీపురం గ్రామానికి చెందిన దండ సంపత్ చోరీకి పాల్పడ్డట్టు విచారణలో వెల్లడైంది. ఎస్సై కోర్టులో దాఖలు చేసిన చార్జీషీట్ ఆధారంగా తొమ్మిదిమంది సాక్షులను విచారించి, ఏపీపీ జయలత వాదనలు విన్న జిల్లా జ్యుడిషియల్‌ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ స్వాతిమురారి ముద్దాయికి ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు, రూ. 10 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు తెలిపారు. కేసు విచారణలో బాధ్యతలు తీసుకున్న సీడీవోలు సంపత్‌రెడ్డి, రాంబాబులను సీఐ మహేందర్‌రెడ్డి అభినందించారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



పూజలు చేస్తున్న ఝాన్సీరెడ్డి

తొర్రూరు రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత ఉంటుందని పీసీసీ వైస్ ప్రెసిడెంట్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. చెర్లపాలెంలో నూతనంగా నిర్మించిన రేణుక ఎల్లమ్మ దేవాలయం ప్రారంభోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్థులు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హమ్యానాయక్, కాంగ్రెస్ నాయకులు సోమేశ్వర్ రావు, మహేందర్, దేవేందర్ రెడ్డి, యాకూబ్ రెడ్డి, సోమిరెడ్డి, మంగళపల్లి రామచంద్రయ్య, పంజా కల్పన గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు. కాగా, చెర్లపాలెం గ్రామంలో రేణుక ఎల్లమ్మ దేవాలయం ప్రారంభోత్సవానికి వేర్వేరుగా హాజరైన తొర్రూరు మార్కెట్ చైర్మన్ హనుమాండ్ల తిరుపతి రెడ్డి మాట్లాడుతూ దైవాన్ని నమ్మిన వారిని ధర్మం కాపాడుతుందన్నారు. బడుగు బలహీనవర్గాలకు అండగా ఉండడం కోసం తాత హనుమాండ్ల మాధవరెడ్డి ట్రస్టు ద్వారా సేవలందిస్తూ అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, నాయకులు రామసహాయం కిషోర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, మల్లేశం గౌడ్, తూనం శ్రావణ్, జాటోతు బాలు నాయక్, మహేష్, పెద్ది ప్రవీణ్ గౌడ్, అన్వేష్ గౌడ్‌తో పాటు మాజీ ఎంపీటీసీ కిరణ్, నాగయ్య పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్



రికార్డులను పరిశీలిస్తున్న సుధీర్‌రాంనాథ్ కేకన్

మరిపెడ, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేదిలేదని జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. మంగళవారం ఎస్పీ మరిపెడ పీఎస్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణతో పాటు నామినల్ రోల్, ప్రాపర్టీరూమ్‌ను సమీక్షించారు. స్టేషన్ పరిసరాలను, శుభ్రత విధానాన్ని పరిశీలించారు. అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులు, కోర్టు కేసులు, లాంగ్‌పెండింగ్ కేసులపై ఆరా తీశారు. ఏమైనా సందేహాలు ఉంటే ఇన్వెస్టిగేషన్ సెంటర్ సేవలను వినియోగించుకోవాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక సాంకేతికను ఉపయోగించి పోలీసులు ముందుకెళ్లాలన్నారు. స్టేషన్‌కు వచ్చేవారితో సన్నిహితంగా ఉండాలని సూచించారు. నేర నివారణపై దృష్టి సారించాలన్నారు. హిస్టరీ షీట్, సస్పెక్ట్, పాత నేరస్తులపై నిఘా ఉండాలన్నారు. నైట్ బీట్ నిర్వహించే పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్పీ వెంట తొర్రూరు డీఎస్పీ కృష్ణకిశోర్, మరిపెడ సీఐ రాజ్‌కుమార్‌గౌడ్, ఎస్సై సతీశ్, అదనపు ఎస్సై కోటేశ్వర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

సీరోలు పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ

కురవి : సీరోలు పోలీస్‌స్టేషన్‌ను మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భద్రత పరమైన ఏర్పాట్లను పర్యవేక్షించారు. లాంగ్ పెండింగ్ కేసులను పరిష్కరించాలని, నేర నివారణపై దృష్టి పెట్టాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. ఆన్‌లైన్ మోసాలు, బెట్టింగ్ యాప్‌లు, రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. సీఐ రాజ్‌కుమార్, ఎస్సై సంతోష్ పాల్గొన్నారు.

'పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఎలాంటి వ్యాధులు దరి చేరవు'

● ప్రాథమిక వైద్యాధికారి రవి

మరిపెడ రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఎలాంటి వ్యాధులు దరిచేరవని ప్రాథమిక వైద్యాధికారి గుగులోతు రవి అన్నారు. మంగళవారం మండలంలో మూలమర్రి తండా జీపీలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి 60 మందికి పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు వహించాలన్నారు. ఈ వైద్యశిబిరంలో తానంచర్ల పల్లె దవాఖానా సిబ్బంది ఝాన్సీ, హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణ, లక్ష్మీకుమారి, హెల్త్ అసిస్టెంట్ వీరయ్య, ఏఎన్‌ఎం రోజమణి, ఆశాలు విజయ, అనిత తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి అవకాశాలను వినియోగించుకోవాలి'

మరిపెడ రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : పదో ఉత్తీర్ణులైన యువతులు ఉపాధి అవకాశాలను వినియోగించుకోవాలని కస్తూర్బా గాంధీ గురుకులం ప్రత్యేక అధికారిణి శ్రీలత అన్నారు. మంగళవారం మండలంలోని గిరిపురం క్రాస్ రోడ్డు వద్ద ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల గురుకులంలో మాట్లాడారు. కస్తూర్బా గాంధీ బాలికల గురుకులంలో పదో తరగతి పాస్ అయిన యువతులకు ఎంపీహెచ్‌డబ్ల్యూ (మల్టీపర్పస్ హెల్త్ వర్కర్) కోర్సులో తక్షణ ప్రవేశాలకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈ కోర్సులో ఆసక్తి కలిగిన యువతులు కళాశాల పని వేళల్లో సంప్రదించాలని ఆమె కోరారు. అంతేకాక తమ గురుకులంలో గెస్ట్ ఫ్యాకల్టీగా పని చేయడానికి బీఎస్సీ నర్సింగ్‌కు రెండు పోస్టులు, ఎంఏ బీఈడీ(ఆంగ్లం) పోస్టుకు ఒక దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 88970 19492 నెంబరు సంప్రదించాలని ఆమె కోరారు.

ధర్నాను విజయవంతం చేయాలి

తొర్రూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించేందుకు ఆగస్టు 1న కలెక్టరేట్‌ల ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ ఐక్య ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ ఉపాధ్యాయదర్శిని సంపాదకవర్గ సభ్యుడు సూరం ఉపేందర్ రెడ్డి, యూపీఎస్‌సీ జిల్లా స్టీరింగ్ కమిటీ నాయకుడు ఎ.మురళీకృష్ణ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆగస్టు 1న జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నాకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగమల్లయ్య, కొండం జనార్ధన్, కొలుపుల శ్రీను, రమేశ్, దర్గయ్య, సునీత, జ్యోతి, సబియాబాను, రవీందర్ రెడ్డి, సంపత్ తదితరులు ఉన్నారు.

ఇంటర్ గురుకుల ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు

మరిపెడ, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : సాంఘిక సంక్షేమ గురుకుల ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు భద్రాద్రి జోన్ లెవల్ స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియను ఈ నెల 31న మరిపెడ ఎస్సీ గురుకుల కళాశాలలో నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ సామాల దయాకర్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీ, బైపీసీ ప్రవేశాల కోసం ఎస్సెస్సీలో 360మార్కులు దాటిన విద్యార్థులు మూడు పాస్ ఫొటోలతో పాటు ఆధార్‌కార్డు, టెన్త్‌లెవల్ అన్ని ఒరిజనల్ సర్టిఫికెట్లు, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలతో పాటు మూడేసి జిరాక్స్ సెట్లను జతపర్చాలన్నారు. తల్లిదండ్రుల్లో ఎవరైనా ఒకరి ఆధార్, ఓటర్ ఐడీ ఉండాలన్నారు.

సోషల్ వెల్ఫేర్‌లో..

తొర్రూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో ఇంటర్మీడియట్‌లో 2025-26 సంవత్సరానికి స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.విజయరత్నమాల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ మొదటి సంవత్సరానికి ఖాళీ సీట్ల భర్తీకై ఈ నెల 31వ తేదీన స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ఒరిజినల్ సర్టిఫికెట్‌ల పరిశీలన అనంతరం అదేరోజు సాయంత్రం 4గంటలకు ఎంపికైన విద్యార్థుల జాబితా ప్రకటిస్తామన్నారు. అర్హులైన విద్యార్థినులు మధ్యాహ్నం 1 గంట వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

31న స్పాట్ అడ్మిషన్లు

ఇనుగుర్తి, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : ఇనుగుర్తి సాంఘీకసంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశం కోసం ఈనెల 31న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ జి.జయశ్రీ మంగళవారం తెలిపారు. సీఈసీలో 20, హెచ్‌ఈసీలో 25 గ్రూపుల్లో ఖాళీలు ఉన్నాయని, విద్యార్థులు ఉదయం 9 గంటలకు తమ పదో తరగతి, కులం, ఆదాయం, పుట్టినతేదీ ధృవీకరణ పత్రాలను తీసుకుని రావాలని కోరారు.

రోడ్డు పనులు ప్రారంభం

ఇనుగుర్తి, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : ఇనుగుర్తికి చెందిన రాజ్యసభ సభ్యుడు రవిచంద్ర తన ఎంపీ నిధుల నుంచి మంజూరు చేసిన రూ.20లక్షల సీసీ రోడ్డు పనులను చిన్ననాగారంలో మంగళవారం మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ కనరబోయిన విజయ్‌యాదవ్ ప్రారంభించారు. బీఆర్‌ఎస్ నాయకులు మద్దెల సుదాకర్, చెడుపాక యాకూబ్, బైరు కొమురయ్య వాడపల్లి కొండయ్య ముత్తయ్య పాల్గొన్నారు.

అర్లగడ్డతండాలో వెలుగని స్ట్రీట్ లైట్లు



అర్లగడ్డతండాలో వెలుగని స్ట్రీట్‌లైటు

మరిపెడ, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : మరిపెడ మునిసిపల్‌లోని అర్లగడ్డతండాలో 8 నెలలుగా స్ట్రీట్ లైట్లు పెట్టడంలేదని ఆ తండావాసులు ఆరోపిస్తున్నారు. చీకట్లోనే మగ్గుతున్నామని గిరిజనులు వాపోతున్నారు. నీటి ట్యాంక్‌లు ఉన్నప్పటికీ పైపుల లీకేజీతో తాగు నీరు కలుషితమవుతుందని, ఆ తాగు నీరే తమకు దిక్కయిందని అర్లగడ్డ తండా గిరిజనులు అంటున్నారు. కలుషిత నీరు తాగడంతో రోగాలకు గురై ఆస్పత్రుల బాట పట్టామని జనం అధికారుల తీరుపై మండి పడుతున్నారు. దీనికి తోడు ఎక్కడి చెత్త అక్కడే ఉంటుందని ఆ చెత్తచెదారంలో పందులు, కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఈగలు, దోమలు జివ్వుమంటూ మనుషుల చుట్టే తిరుగుతున్నాయని అర్లగడ్డతండా గిరిజనులు కన్నీటి పర్యాంతం చెందుతూ ఆందోళనకు గురివతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు తమ తండా సమస్యలను పట్టించుకొని జనం గోస తీర్చాలని వేడుకుంటున్నారు.

హైవేకు మరమ్మతులు చేయాలి



ఉన్న రోడ్డును పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

గూడూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : బొద్దుగొండ వద్ద అసంపూర్తిగా ఉన్న జాతీయ రహదారి పనులను వెంటనే పూర్తి చేయాలని సీపీఐ గూడూరు మండల కన్వీనర్ మాలోతు రవీందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బొద్దుగొండ వద్ద అసంపూర్తిగా నిర్మించకుండ వదిలేసిన రహదారిని మంగళవారం సీపీఐ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ బొద్దుగొండ రహదారి వద్ద హైటెన్షన్ విద్యుత్ వైర్లు ఉన్నాయన్న సాకుతో రహదారిపై రోడ్డు వేయకుండా అసంపూర్తిగా వదిలేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో యాక్యానాయక్, బాలాజీ, మల్లయ్య పాల్గొన్నారు.

'నీరు నిల్వకుండా చర్యలు తీసుకుంటాం'

డోర్నకల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలోని మైనార్టీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల పరిసరాలలో నీరు నిల్వకుండా చర్యలు చేపట్టనున్నట్లు డోర్నకల్ తహసీల్దార్ ఇమ్మాన్యుయేల్, మునిసిపల్ కమిషనర్ నిరంజన్‌లు అన్నారు. మంగళవారం మైనార్టీ పాఠశాలను వారు సందర్శించారు. వర్షాకాలంలో పాఠశాల సమీపంలో వరద నీరు చేరుతుందని దీంతో దోమలవ్యాప్తి ఎక్కువగా ఉందని పాఠశాల ప్రిన్సిపల్ రిజ్వానవారి దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన వారు ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి నీరు నిల్వకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వారి వెంట పబ్లిక్ హెల్త్ ఏఈ శృతి ఉన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతి

తొర్రూరురూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతి చెందిన సంఘటన మంగళవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం. కంఠాయపాలెం గ్రామానికి చెందిన దామసాని ఎలయ్య (65) మతిస్థిమితం లేకుండా తిరుగుతుండే వారు. ఈ క్రమంలో ఖమ్మం-వరంగల్ జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారు జామున గుర్తుతెలియని వాహనం ఢీ కొనడంతో మృతి చెందారు. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుమారుడు సైదులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు.

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం

కేసముద్రం, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి సారధ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలోనే బీసీలకు సామాజిక న్యాయం జరుగుతుందని టీపీసీసీ ఓబీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల వీరన్నయాదవ్ అన్నారు. కేసముద్రం విలేజీలో మంగళవారం పార్టీ కార్యకర్తల ఆత్మీయసమ్మేళనం కత్తెరశాల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించారని తెలిపారు. గత ప్రభుత్వాలు ఏమీ చేయని విధంగా బీసీల సంక్షేమం కోసం పాటుపడుతోందని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం సీట్లు ఇవ్వబోతున్నారని తెలిపారు. కార్యకర్తలు ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయం కోసం పాటుపడాలని సూచించారు. కాంగ్రెస్ నాయకులు కీర్తి సురేందర్, చిట్ల సంపత్, రవి, మాసాడి శ్రీను, అజ్మీర రమేష్, బైరు వెంకన్న, మహేందర్, కిషన్, అశోక్, కట్టయ్య, నాగయ్య పాల్గొన్నారు.

గ్రామాల్లో, తండాలకు లయన్స్ సేవలు విస్తృతం



తాట్యతండా పాఠశాలలో విద్యార్థులకు షూ పంపిణీ చేస్తున్న లయన్స్ బాధ్యులు

మహబూబాబాద్ టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవల్లో లయన్స్‌క్లబ్ ఎప్పుడు ముందుంటుందని, లయన్స్ సేవలు పట్టణాలకే పరిమితం కాకుండా తండాలు, గ్రామాలకు విస్తరింప జేశామని క్లబ్ మానుకోట శాఖ అధ్యక్షుడు డాక్టర్ బి.వీరన్న అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు తాట్యతండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో లయన్స్‌క్లబ్ సీనియర్ సభ్యులు డాక్టర్ చాపల రంజిత్‌రెడ్డి, అన్నపూర్ణ రెడ్డి దంపతుల పెళ్లి రోజును పురస్కరించుకుని మంగళవారం 30 మంది విద్యార్థులకు షూ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బి. వీరన్న మాట్లాడుతూ సామాజిక సేవకు మారు పేరు లయన్స్ అని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వర్కాల రవీందర్‌రెడ్డి, కోశాధికారి కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, సీడబ్ల్యూసీ జిల్లా చైర్‌పర్సన్ నాగవాణి, అనుమాల వెంకటేశ్వర్లు, మాలె కాశీనాథ్, గ్రామ మాజీ సర్పంచ్ రమేష్, పాఠశాల హెచ్‌ఎం మంజుల పాల్గొన్నారు.

తొర్రూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో

తొర్రూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : లయన్స్ క్లబ్ సభ్యుల జన్మదిన సందర్భంగా సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని లయన్స్ క్లబ్ పూర్వపు గవర్నర్ డాక్టర్ రాజేందర్ రెడ్డి అన్నారు. క్లబ్ సభ్యుడు చీదర మహేష్ పుట్టిన రోజు సందర్భంగా హమాలీలకు బట్టలు, దుప్పట్లు పంపిణీ, మహాన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. పేద ప్రజలను ఆదుకునేందుకు లయన్స్ క్లబ్ సభ్యులు ఎల్లప్పుడు ముందుండాలన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.రాం నర్సయ్య, ప్రధాన కార్యదర్శి రవీందర్ రెడ్డి, చిదిరాల నవీన్ కుమార్, రమేశ్, కిరణ్‌కుమార్, నరేశ్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, శంకర్ ఉన్నారు.